# రాజకీయాలు - అధికారం - గాంధీ ఆలోచనలు

"రాజకీయాలంటే ఏమిటి?'' అని ఈ వేళ ఏ యువకుడిని అడిగిన చెప్పే సమాధానం ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటూ ప్రత్యర్థిని ఏదో రకంగా ఇబ్బంది పెట్టడం, క్రిందికి లాగడం, తను ఎలాగోలా అధికారంలోకి రావడం అని ఠక్కున సమాధానం చెప్పేస్తాడు. అంటే రాజకీయాలకి పరమార్థం - పదవి. మార్గం ఏదైనా, పద్ధతి ఏదైనా, అవినీతి, దుర్మార్గం చేసినా తప్పేం లేదు అనే భావన రాజకీయాలలో చాలా బలంగా వేనూళ్ళుకుంది. "రాజకీయం'' అనే పదంలోనే అదేదో అంతఃపురంలో అధికారం కోసం, సింహాసనం కోసం గతంలో రాజులు చేసిన ఎత్తుగడలు, దుర్మార్గాలు, హత్యలు, అవినీతి.. ఇవన్నీ భాగంగా కలిసి పోయాయని, చదువుకున్న వారు, సంస్కారం ఉన్న వారు, సహృదయులు ఎంచుకోదగ్గ వ్యవహారం కాదు అనే భావన ప్రజల్లో బలంగా వుంది.

సాధారణంగా ఓ నిఘంటువులో చూసిన లేదా రాజకీయ శాస్త్రం ఒక సబ్జెక్టుగా కళాశాలల్లో చదువుకున్నా - "రాజకీయాలు'' అంటే ఒక దేశపు లేదా ప్రాంతపు ప్రభుత్వాన్ని నడిపే విషయంతో ముడిపడి వున్న క్రియాశీలక వ్యవహారం అని అర్థం అవుతుంది. ప్రతి మనిషిలోనూ గుర్తింపుకు సంబంధించిన ఆలోచన వుంటుంది. అదే ఒక వ్యక్తి కవిగా, కళాకారుడిగా, జ్ఞానిగా తనను తాను వ్యక్తీరించుకునే ప్రయత్నానికి ప్రేరేపిస్తుంది. అలాంటి ఓ సామాజిక కోణమే రాజకీయం.

పదహారు, పదిహేడవ శతాబ్దాల నుండి పాశ్చాత్య దేశాలలో, ముఖ్యంగా యూరోప్‌లో, చర్చికి - రాజుకి జరిగిన అంతర్గత ఆధిపత్య పోరాటాల ఫలితంగా "లౌకిక రాజ్యం'' అనే ఆలోచన వచ్చింది. అయితే మతం, ఆధ్యాత్మికత ఎక్కువ ప్రాధాన్యత కలిగిన ఆసియా దేశాలలో, ముఖ్యంగా భారతదేశంలో ఇది అంతబలంగా జనబాహుళ్యంలోకి చొచ్చుకపోలేదు. అదే విధంగా పాశ్చాత్య దేశాలలో వచ్చిన అనేక రాజకీయ సిద్ధాంతాలు, సిద్ధాంతకర్తలు - మాఖియవెల్లీ, హెగెల్, మార్క్స్, నీషే. ప్రధానంగా "అధికారం'' సంపాదించడం, నిలుపుకోవడం, ఈ ప్రయత్నంలో అవసరమైతే అన్ని నైతిక విలువలని ప్రాధాన్యత లేని విషయాలుగా పరిగణించడం అనే ఆలోచనకే అవకాశం ఇచ్చారు. ఈ రెండు ధోరణులు ఇరవయ్యవ శతాబ్ది చివరి నాటికి రాజకీయాలు అంటేనే అధికారం సంపాదించడం అనే స్థాయికి చేరుకున్నాయి. ఈ ధోరణిలో నైతిక విలువలు తమ ప్రాధాన్యతని పూర్తిగా కోల్పోయాయి. అధికారం కోసం ఏ మార్గమైనా, ఏ పనైననా చేయవచ్చుననే భావన, ఒకసారి అధికారం వస్తే - తాము అంతర్గతంగా అభిమానించే నైతిక విలువల్ని నిలబెట్టవచ్చుననే భావన బలపడింది. అంటే ఏ రాజకీయ సిద్ధాంతానికైనా అంతిమ ధ్యేయం అధికారం. మార్గం ఏదైనా పరవాలేదు.

ప్రష్యన్ రాజనీతిజ్ఞుడు, నాయకుడు అయిన బిస్మార్క్‌ని రాజకీయాలంటే ఏమిటి అని అడిగితే "Politics is the art of the possible, the attainable, the art of the next best" అన్నాడట. అంటే ఉన్న పరిస్థితులలో ఏది సాధ్యమో, దాన్ని అత్యంత చాకచక్యంగా సాధించడం, అది కాకపోతే తరువాత ఏది సాధ్యం అయితే అది చేయగలగడం. రాజకీయాలనేవి ఒక క్రీడగా, జూదంగా మారిన పరిస్తితుల్లో - ఆల్బెర్ట్ అయిన్ స్టీన్ ని అడిగితే - "భౌతిక శాస్త్రం కంటే రాజకీయాలే కష్టం" అన్నాడట. చదువుకున్న వాళ్ళని అంతగా భయపెట్టాయి రాజకీయాలు.

ఈ మధ్య కాలంలో రాజకీయాలు అంటే - ధనబలం, కులబలం, ప్రాంతీయ బలం అనే అర్థం వచ్చేసింది. మానవ సమాజంలో వున్న అన్ని బలహీనతలని, ఉద్రేకాలని, ఉద్వేగాలని వాడుకుని, రెచ్చగొట్టి ఆ ఆవేశాలతో ఆడుకోవడమే రాజకీయ ప్రక్రియ అన్నది కూడా నానుడి అయిపోయింది. సాధారణ వ్యక్తులు ప్రవేశించి, ప్రభావితం చేయగలిగే శక్తిని రాజకీయాలు అసాధ్యంగా మార్చేశాయి. "Politics is the last resort of the scoundrals" అని సామ్యుయేల్ జాన్సన్ అనే మేధావి అన్నాడంటే సాధారణ ప్రజల్లో రాజకీయాలపైన ఏహ్యాభావం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చును.

అయితే గత ఐదువందల సంవత్సరాల రాజకీయ సిద్ధాంతాలని ప్రశ్నించిన ఏకైక, క్రియాశీల రాజకీయ నాయకుడు గాంధీ. తన తొలి సైద్ధాంతిక ప్రతిపాదన "హింద్ స్వరాజ్" మొదలుకొని చివరి శ్వాస దాకా ఈ దారితప్పిన రాజకీయ సిద్దాంతాన్ని సవరించే ప్రయత్నం చేశాడు గాంధీ. సౌత్ ఆఫ్రికా నుండి ఇండియా వచ్చాక తన రాజకీయ గురువు గోఖలే ఆజ్ఞ మేరకు ఒక సంవత్సరం పాటు మౌనంగా వుండి, భారతదేశమంతా పర్యటించి ప్రజల జీవన పరిస్థితుల్ని గమనించిన గాంధీ, 1916 నుండి క్రియాశీలక రాజకీయాలలో మునిగిపోయారు. 1917-22ల మధ్యకాలంలో చంపారన్, అహమ్మదాబాద్ జౌళి కార్మికుల ఉద్యమం, ఖేదా, సహాయ నిరాకరణ.. ఇలా అనేక ఉద్యమాలని బలమైన నైతిక పునాదులపై నిర్మించాడు.

1919 ప్రాంతంలో ఒకసారి మాంటేగూ అనే బ్రిటిష్ అధికారి గాంధీజీతో మాట్లాడుతూ : "మీరు ఆధ్యాత్మిక వ్యక్తి గదా, ఈ రాజకీయాల్లోకి దారి తప్పి వచ్చారా?" అన్నాడట. అలాగే, జనవరి, 1920లో తిలక్ గాంధీకి ఓ ఉత్తరం వ్రాస్తూ, అందులో - "రాజకీయాలు ప్రాపంచిక జీవితం గడిపే వారి క్రీడ, అది సాధువుల వ్యవహారం కాదు" అన్నాడట. అయితే గాంధీ దానికి జవాబిస్తూ - "ఆధ్యాత్మిక జీవితం ఎంచుకున్న వారిని రాజకీయాల్లోకి రావద్దనటం వారి అలసత్వాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని పెంచడం" అని జవాబిచ్చాడు. దాదాపు ఏడు, ఏనిమిది శతాబ్దాల కాలం నుండి ఆధ్యాత్మిక మార్గం ఎంచుకున్న వారంతా భౌతిక ప్రపంచాన్ని, సమాజాన్ని వదిలేసి దూరంగా అరణ్యాలకో, ఆశ్రమాలకో, హిమాలయాలకో వెళ్ళిపోవడం భారతదేశంలో ఒక ప్రధానమైన అంశం.

అయితే తన చుట్టూ ఉన్న సమాజం, ప్రజలూ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంటే, జ్ఞానులు ఇలా ప్రవర్తించడాన్ని బాధ్యతా రాహిత్యంగా భావించారు గాంధి. అంతేకాదు 'మోక్షం' అనేది వ్యక్తిగతం ఆదేమో అన్న ప్రతిపాదన గాంధీ తన 30-35 సం॥ల వయస్సుకే రావడం ఆయనలో ఒక మహోన్నతమైన ఆలోచన.

రాజకీయాల ప్రధాన ఉద్దేశ్యం అధికారం. ఈ భావనలో "సేవ" అనేది ఒక అంశమైనా, అది ప్రధానమైన అంశం కాదు. పాశ్చాత్య దేశాలలో రాజకీయాలు - అధికారం అనే చర్చలో - అధికారం కోసం ప్రయత్నించే మార్గం, విధానం అంత ప్రధానాంశాలు కాదు. చార్ల్స్ ది గోల్ (Charles de Gaulle) అనే ఫ్రెంచ్ రాజకీయ నీతిజ్ఞుడు, సైన్యాధికారి - "రాజకీయాలనేవి చాలా గంభీరమైన విషయం. వాటిని కేవలం రాజకీయ నాయకులకే వదలివేయలేం" అంటాడు. 16వ శతాబ్దపు ఇటాలియన్ రాజకీయ తత్త్వవేత్త మ్యాఖియవెల్లీ (Niccolo Machiavelli) తన "Prince" అనే గ్రంథంలో రాజకీయాలని ఏ మాత్రం దయాదాక్షిణ్యాలు లేని యంత్రాంగంగా మార్చివేశాడు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రజా తంత్ర రాజ్యాలలో కూడా రాజకీయాలనేవి సంఖ్యాపరమయిన ఆధిక్యతగా మారిపోయాయి. వంద మంది ఉన్న సమాజంలో యాభై ఒక్క మంది ఒక రాజకీయ పార్టీని ఎన్నుకుంటే అది ఆధిక్యత ఉన్న పక్షం. వాళ్ళకు అధికార అవకాశం ఉన్న ఐదు, ఆరు సంవత్సరాలు వారు ఏమైనా చేయవచ్చును. అయితే వంద మంది ఉన్న సమాజంలో వంద మందీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనరు కదా! అంతేకాక బహుళ రాజకీయ పార్టీలు ఉంటే ఒక్కోసారి 35-40 శాతం ఉన్నవారు కూడా మెజారిటీ పార్టీగా అధికారం చలాయించి, మిగిలిన 70 శాతాన్ని నిర్లక్ష్యం చేయవచ్చును. అంటే ప్రజాస్వామ్యం కూడా రాజకీయాల్ని విషవలయంగా మార్చే అవకాశం వుంది.

ఇక ఇంకో మార్గం - విప్లవ రాజకీయాలు అంటే మార్క్సిజం, బోల్షివిజం, ఫ్యాసిజం లాంటివి. వీటిలో అధికారం నిర్ణయించేది కేవలం ప్రజల ఆకాంక్షే కాదు. అధికారాన్ని చేజిక్కించుకునే వర్గం మైనారిటీ అయినా బలం, ఆయుధాలు - విజయాన్ని నిర్ణయించేది. ఇందులో ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు ప్రతిఫలిస్తాయి అనేది ప్రధాన సమస్య. ఈ సమాజాలు మెల్లగా నిరంకుశంగా మారడం, హింస మీద ప్రధానంగా ఆధారపడడం మనకు కనిపిస్తుంది.

రాజకీయాలపై ఇలాంటి ప్రధాన ధోరణులు ఉన్న ఈ చారిత్రక సమయంలో ప్రపంచ వ్యాప్తంగా, తొలిసారిగ, రాజకీయాలంటే ఇటు మెజారిటీ అభిప్రాయం మాత్రమే కాదని, అలాగే కొంత మంది చైతన్యవంతుల - హింసతో కూడిన విప్లవ విధానం కాదని - ఈ రెండు ప్రధాన

పాశ్చాత్య ధోరణులకు వ్యతిరేకంగా, భిన్నంగా - రాజకీయాలంటే అనేక వర్గాలనీ, సమూహాలనీ, ప్రజలని కలుపుకుపోవడం, ఏకాభిప్రాయసాధన ప్రయత్నించడం, అహింస మార్గాన్ని విడనాడటం, సత్యం ప్రాతిపదికగా ప్రజాసేవ, వీలయినంత ఎక్కువ మంది ప్రజల ఆకాంక్షలని ప్రతిఫలించడం అని చెప్పిన వ్యక్తి గాంధి. అంత్యోదయ, సర్వోదయ అనే నూతన ప్రతిపాదనలతో సామాజిక క్షేమానికి నూతన అర్థం ఇచ్చిన వ్యక్తి - గాంధి.

గాంధీ ప్రధానంగా ఆధ్యాత్మిక వాది. ఆధ్యాత్మిక వాదులు సాధారణంగా దైనందిన విషయాలయిన రాజకీయాలకి దూరంగా వుంటారు. వారి ప్రధాన ధ్యేయం మోక్షం. అయితే గాంధీజీ విలక్షణమయిన ఆధ్యాత్మిక వాది. తన సమాజం, తన చుట్టూ వున్న ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంటూ - వ్యక్తిగతమైన మోక్షం కోసం ప్రయత్నించడం అనైతికం. అలాంటి వ్యక్తికి ఎట్టి పరిస్థితులలోనూ మోక్షం రాదు అని నమ్మిన వ్యక్తి గాంధీ. అందువల్ల సనాతన హిందూ ధర్మంలోని అనేక విషయాలని పునఃపరిశీలించి, రాజకీయాలని, సామాజిక ఉద్యమాలలో వ్యక్తిపాత్రని - ధర్మ, అర్థ, కామాలలో భాగంగ నిర్వచించి, దాని ద్వారా మోక్షానికి ప్రయత్నంచేయాలని ప్రతిపాదించిన వ్యక్తి గాంధీ. మతం అంటే కేవలం కొన్ని ప్రామాణిక గ్రంథాలని గౌరవించడం, విగ్రహాలని పూజించడం, ఆరాధన కాదని, మతం అంటే ప్రధానంగా "నైతికత" అని నిర్వచించిన వ్యక్తి గాంధీ. ఆధ్యాత్మిక జీవనం అంటే బాహ్య ప్రపంచం నుండి పారిపోయి, ఆశ్రమాలలో ముక్కు మూసుకొని జపం, తపం చేయడం కాదు, సమాజంలో ఉంటూ అందరి ఉన్నతికి (మోక్షానికి) ప్రయత్నించడం అని నిర్వచించిన వ్యక్తి గాంధి.

అందుకే అనేకమంది తన గురువులు కాదన్నా స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నడిపించి, ఆధునిక ప్రపంచంలో ఆధ్యాత్మిక జీవనం గడిపే వారు కూడా రాజకీయాలలో పాలు పంచుకోవాలని కోరాడు. "మతం" లేదా "ఆధ్యాత్మికత" అనేది ముఖ్యంగా నైతిక విషయం అని, అవి రాజకీయాలకు దూరంగా వుంటే రాజకీయాలు విషమయి పోతాయి, అనైతికమై పోతాయి అని గాంధీజీ ప్రతిపాదన. "మతం" అంటే ఓ విగ్రహాన్నో, పుస్తకాన్నో ఆరాధించడం కాదు. "మతం" అంటే ఓ ఉన్నతమైన జీవన విధానాన్ని ప్రజలకు అందివ్వడం అనేది ఆయన మరో ప్రతిపాదన. విలువలు లేని రాజకీయాలు దేశాన్ని, ప్రజలని నాశనం చేస్తాయి. రాజకీయాల్లో విలువలు ఉండాలంటే 'ఆధ్యాత్మికత' అనే ప్రాతిపదికతన ఉండాలి. అందుకు ఆయన తన సౌత్ ఆఫ్రికా రోజుల నుండి "రాజకీయాలు" పురుషార్థాలలో (ధర్మ, ఆర్థ, కామ, మోక్షాలలో) ఒక భాగం అనే చాలా వినూత్నమైన ప్రతిపాదన కూడా చేశారు. అందువల్ల రాజకీయ ప్రక్షాళనకు గాంధీమార్గం చాలా అవసరం.

రాజకీయాల పట్ల గాంధీ అవగాహనలో ప్రధానాంశాలు (1) ఆధునిక జీవితంలో రాజకీయాలు తప్పనిసరి అంశం. (2) సాధారణ వ్యక్తి అయినా, ఆధ్యాత్మిక జీవి అయినా ఈ ఆధునిక యుగంలో రాజకీయ స్పృహ తప్పనిసరి (3) రాజకీయం అంటే కేవలం అధికారం కాదు, అది ఒక వ్యక్తి జీవితంలో ఆచరించవలసిన "అర్థ", "కామ" అనే అంశంలో భాగం. (4) రాజకీయాలని మతం నుండి వేరు చేయడం తప్పు - మతం అంటే నైతికత అని అర్థం చేసుకుంటే నైతికత లేని రాజకీయాలు ప్రమాదకరమైనవి.

రాజకీయాల విషయంలో గాంధీ ఇప్పటి దాకా వున్న సిద్ధాంతాలతో విభేదిస్తారు. దానిని ఒక సైద్ధాంతిక విషయం (theoretical subject)గా కాక ఆచరణాత్మక విషయంగా, ఆచరణ ద్వారా వచ్చే సమస్యలని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్ళే మార్గంగానే భావిస్తారు. రాజకీయ సిద్ధాంతాలు అనేవి విశ్వ విద్యాలయాల్లో, గ్రంథాలలో, సిద్ధాంతీకరణలో ఇమిడే అంశం కాదని భావిస్తారు.

డా. అవధానం రఘు కుమార్
0441015709